క్లుప్తంగా

వైద్యుల నిర్లక్ష్యంతోనే గర్భిణి మృతి

నర్సీపట్నం : ఏరియా ఆసుపత్రిలో నిండు గర్భిణి వైద్యులు నిర్లక్ష్యం వల్లనే ప్రాణాలు కోల్పోయిందని బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ బొట్టా నాగరాజు పేర్కొన్నారు. తల్లి, బిడ్డ ప్రాణాలను వైద్యులు బలికొనడం బాధకరమన్నారు. మృతికి కారకులైన వైద్యులు, వైద్య సిబ్బందిని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గర్భిణి మృతి చెందినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు



గ్రామాల్లో మేలుకొలుపులు తిరుగుతున్న మహిళలు

మాడుగుల : మండలంలో ధనుర్మాసం ప్రారంభం నుంచి 60 గ్రామాల్లో తెల్లవారు నుంచి మేలుకొలుపులు నిర్వహిస్తున్నారు. దీంతో ఏ గ్రామం చూసినా రామనామ భజనల్లో ప్రజలు నిమగ్న మవుతున్నారు. వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొనడంతో గ్రామాల్లో ఆధ్యాత్మికత నెలకొంది. మాడుగుల పార్థసారథి ఆలయం, సీతారామ స్వామి ఆలయంలో పరిధిలో భక్తులు తిరువీధి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

5న రక్తదాన శిబిరం



తహసీల్దార్‌కు ఆహ్వానపత్రం అందిస్తున్న సబ్ రిజిస్ట్రార్

చోడవరం రూరల్: స్థానిక హార్డింజ్ రెస్ట్ హౌస్ ఆవరణలో వచ్చే నెల 5న జరగనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని సద్భావ టీం సభ్యురాలు, సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి ప్రభుత్వ కార్యాలయ అధికారులను కోరారు. సీడీవీఎం సద్భావ టీం ఆధ్వర్యంలో జీవధార్ రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. మంగళవారం ఆమె తహసీల్దార్ రామారావు, సబ్ ట్రెజరీ అధికారులను కలిసి రక్తదాన శిబిరం పత్రికలను అందజేశారు. ఇది 25వ రక్తదాన శిబిరం అయినందున అధికారులు తమవంతు సహకారం అందించి, ప్రజలకు సమాచారాన్ని చేరవేసి విజయవంతం చేయాలని కోరారు.

పశుగణన సర్వేపై ప్రత్యేక దృష్టి



వరహాపురంలో సర్వేను పరిశీలిస్తున్న చిట్టిబాబు

చీడికాడ: గ్రామాల్లో చేపట్టిన పశుగణన సర్వేపై ప్రత్యేక దృష్టి సారించాలని పశుసంవర్ధక శాఖ మాడుగుల సహాయ సంచాలకుడు వి.చిట్టినాయుడు తెలిపారు. మంగళవారం వరహాపురం రైతు సేవా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి గ్రామంలోని పలు ఇళ్ల వద్దకు వెళ్లి పశుగణన సర్వేపై ఆరా తీశారు. మిగిలిన ఇళ్లను వేగంగా సర్వే పూర్తి చేయాలని సూచించారు. సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ మాధవి పాల్గొన్నారు.

56 మందికి నేత్ర వైద్య పరీక్షలు



రోగులకు మందులు అందజేస్తున్న సర్పంచ్ దాసరి సంతోష్‌కుమార్

దేవరాపల్లి: వెంకటరాజుపురంలో మంగళవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గాజువాకకు చెందిన కిరణ్ విజన్ సెంటర్ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని సర్పంచ్ దాసరి సంతోష్‌కుమార్ ప్రారంభించారు. వైద్యులు జి. నాని, ఎం. దేముడు 56 మంది రోగులకు కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరం నిర్వహణకు సర్పంచ్ సంతోష్‌కుమార్ సహాయ సహకారాలు అందించారు.

సహకారం నిల్... పరపతి డల్!

సహకార రంగంలో నడుస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) భవనాలు శిథిలావస్థకు చేరాయి. మాడుగుల కేంద్ర సహకార బ్రాంచి పరిధిలో 8 సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో నాలుగు సంఘాలు సొంత భవనాల్లో కొనసాగుతుండగా నాలుగు సంఘాల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్నాయి.

- శిథిలావస్థకు చేరిన సొసైటీ భవనాలు
- అద్దె భవనాల్లో సహకార సంఘాల కార్యాలయాలు
- ఆప్కాబ్ నుంచి రుణ సౌకర్యానికి నిరాకరణ
- అందని ప్రభుత్వ నిధులు
- పాత భవనాల తొలగింపు
- పక్కా భవనాలు లేక ఎరువులు, విత్తనాల విక్రయాల నిలిపివేత



శిథిలావస్థకు చేరిన కేజే పురం పీఏసీఎస్ భవనం



దయనీయ స్థితిలో ఒమ్మలి పీఏసీఎస్ భవనం



అద్దె భవనంలో ఎం.కోడూరు పీఏసీఎస్ భవనం

మండలంలో మొత్తం సహకార సంఘాలు	సంఘాల్లో సభ్యులు సంఖ్య	పక్కా భవనాలు గల సంఘాలు	అద్దె భవనాల్లో కొనసాగుతున్న సంఘాలు
08	12,500	4	4

మాడుగుల రూరల్: మండలంలో మాడుగుల, ఎం.కోటపాడు, వీరనారాయణం, వీరవల్లి అగ్రహారం, సహకార సంఘాలు పక్కా భవనంలో కొనసాగుతున్నాయి. మిగిలిన నాలుగు సంఘాలు భవనాలు శిథిలావస్థకు చేరాయి. లాభాల బాటలో వున్న కె.జె.పురం సహకార సంఘ భవనం శిథిలావస్థకు చేరడంతో భవనం పూర్తిగా తుప్పలు, డొంకలతో నివాస యోగ్యం కాని విధంగా ఉంది. ఈ భవనాన్ని 1971లో నిర్మించారు. తర్వాత వచ్చిన పాలకవర్గాలు సంఘ భవనంను మరమ్మతులు చేపట్టారు. కాల క్రమేణా శిథిలావస్థకు చేరడంతో భవనం ఖాళీ చేశారు. గ్రామంలో ఒక అద్దె భవనంలో సహకార సంఘం కొనసాగుతుంది.

నిలిచిపోయిన రుణ మంజూరు

సంఘ భవనం నిర్మాణం కోసం గతంలో ఆప్కాబ్ రుణం కొరకు రూ.30 లక్షలతో ప్రతిపాదనలు పంపించారు. అయితే ప్రస్తుతం ఆప్కాబ్ సంఘ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయలేదు. ప్రభుత్వం నుంచి భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసే అధికారం లేకపోవడం వల్ల ఆప్కాబ్ గతంలో రుణం ఇచ్చేది. నిబంధనల ప్రకారం ప్రస్తుతం ఈ రుణం భవన నిర్మాణాలకు ఇవ్వలేదు. దీంతో కె.జె.పురం పీఏసీఏస్‌కు ప్రస్తుత భవనం పక్కన కొంత ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలం విక్రయించి భవనం నిర్మించాలని ప్రతి ఏటా నిర్వహిస్తున్న సంఘ మహాజన సభలో సభ్యులు తీర్మానిస్తున్నారు. అయితే ఇది ఆచరణ సాధ్యం కాలేదని సభ్యులు పేర్కొన్నారు.

కూలడానికి సిద్ధంగా...

ఒమ్మలి పీఏసీఎస్‌కు పక్కా భవనం 1981లో నిర్మించారు. ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో ఏడాదిన్నర క్రితం గ్రామంలో ఒక ప్రైవేటు అద్దె భవనంలో నెలకు రూ.3వేలు అద్దెతో నడుస్తుంది. సంఘ త్రిసభ్య కమిటీ వారు పక్కా భవనం నిర్మాణం కోసం ఆప్కాబ్‌కు మూడుసార్లు రుణం మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించినట్టు సంఘ మాజీ పర్సన్ ఇన్‌చార్జి బొడ్డపు భాస్కరరావు తెలిపారు. ఒకసారి రూ.40 లక్షలు, తర్వాత రూ.23 లక్షలు, మూడో పర్యాయం రూ.19 లక్షలు నిధులు మంజూరు కాలేదు. ఉన్న భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. పూర్తిగా శిథిలమైన భవనాన్ని తొలగించడానికి కూడా అనుమతి లభించలేదు.

అద్దె భవనంలోనే...

ఎం.కోడూరు పీఏసీఎస్ భవనం కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో మూడేళ్ల క్రితం ఈ భవనాన్ని తొలగించారు. దీంతో గ్రామంలో సంఘ కార్యాలయం అద్దె భవనంలో నడుస్తుంది. పక్కా భవనం నిర్మాణం కోసం ఆప్కాబ్‌కు రూ.25 లక్షలతో ప్రతిపాదనలు పంపించారు. అయితే నిధులు మంజూరు కాలేదని సంఘ మాజీ అధ్యక్షుడు అప్పలనాయుడు పేర్కొన్నారు.



అద్దె భవనంలో ఒమ్మలి పీఏసీఎస్ భవనం

కింతలి సొసైటీదీ అదే దుస్థితి

మండలంలో అతి పెద్ద సహకార సంఘం అయిన కింతలి పీఏసీఎస్ భవనం కూడా శిథిలావస్థకు చేరింది. సంఘ భవనం పూర్తిగా కూలిపోయే స్థితిలో ఉండడంతో దీనిని పూర్తిగా తొలగించారు. ప్రస్తుతం ఈ సంఘ కార్యాలయం అద్దె భవనంలో నడుస్తుంది. సుమారు 10 గ్రామ పంచాయతీలు, శివారు గ్రామాలు కలిపి ఉన్న సంఘానికి పక్కా భవనం కోసం ఆప్కాబ్‌కు రూ.40 లక్షలతో ప్రతిపాదనలు పంపించారు. కానీ నిధులు మంజూరు చేయలేదు.

ప్రభుత్వం స్పందించాలి



ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల మనుగడకు ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలి. గ్రామీణ ప్రాంతంలో వున్న రైతులకు వ్యవసాయ పెట్టుబడులకు చేదోడుగా వున్న సంఘాలకు ఆర్థిక చేయూత నివ్వాలి. గతంలో ఆప్కాబ్ వారు సంఘాలకు రుణాలు మంజూరు చేసేవారు. నేడు రుణాలు మంజూరు చేయకపోవడంతో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. దీంతో ఆర్థిక భారం పెరుగుతోంది. ప్రభుత్వం స్పందించాలి.

– పడాల అప్పలనాయుడు, ఎం.కోడూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు

చేయూత అవసరం



సహకార సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి రైతులకు పరపతి సౌకర్యంతో పాటు సంఘాలకు పూర్తి స్థాయిలో పక్కా భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. కె.జె.పురం సహకార సంఘానికి చెందిన స్థలాన్ని అధికారుల అనుమతితో విక్రయించి పక్కా భవనం నిర్మించాలి. ప్రతి ఏటా జరుగుతున్న సంఘ మహాజన సభల్లో తీర్మానాలకు మాత్రమే పరిమితం అవుతున్నారు. ఆచరణలో శూన్యం. శిథిలావస్థకు చేరడంతో పీఏసీఎస్ అద్దె భవనంలో నడుస్తుంది.

– ఆళ్ల శివకుమార్, పీఏసీఎస్ మాజీ డైరెక్టరు, కె.జె.పురం

అద్దె భవనాలే గతి



గతంలో సహకార రంగానికి ప్రభుత్వం పెద్ద పీట వేసింది. నిబంధనల పేరుతో ఆప్కాబ్, సహకార సంఘాలు పక్కా భవనాలకు రుణాలు మంజూరు చేయలేదు. గతంలో భవనాలకు ఆప్కాబ్ రుణం మంజూరు చేయడం, ప్రతి ఏటా సంఘాల నుంచి రుణాన్ని చెల్లించేవారు. నేడు రుణాలు ఇవ్వక పోవడం వల్ల భవనాలకు నిలువ నీడలేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

– కాళ్ల అప్పలనాయుడు, కె.జె.పురం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు

శిథిలావస్థకు చేరిన సంఘాలకు ప్రభుత్వం నేరుగా నిధులు మంజూరు చేయాలని సంఘాల సభ్యులు కోరుతున్నారు.

ఎరువుల విక్రయానికి విఘాతం

సంఘాలకు పక్కా భవనాలు లేకపోవడంతో రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు విక్రయించలేక పోతున్నారు. ఈ విక్రయాల వల్ల సంఘాలకు ఆర్థికంగా లాభం చేకూరేది. నాణ్యమైన ఎరువులతో రైతులకు మేలు జరిగేది. సంఘాలకు పక్కా భవనాలు లేక వీటి విక్రయాలు నిలిపివేయడం రైతులు ప్రైవేటు వర్తకుల వద్ద అధిక ధరలు చెల్లించి, ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులు కొనుగోలు చేయాల్సి వస్తోంది.

వారసత్వ ఆస్తుల పంపకంలో సమన్వయం అవసరం



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ నాగమ్మ

రోలుగుంట : వెదుళ్లవలస రెవెన్యూ గ్రామం సదస్సును కొవ్వూరు పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించారు. వివిధ భూ సమస్యలకు సంబంధించిన వినతులను తహసీల్దార్ ఎస్.నాగమ్మ స్వీకరించారు. ఆస్తి తనఖా, దాన సెటిల్మెంట్ క్రయ, విక్రయాధికార హక్కులు, వారసత్వ ఆస్తి పంపకంలో కుటుంబ సభ్యులు ఉద్రేక పడకుండా కుటుంబ పెద్దల సమక్షంలో నిర్ణయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శంకరావు , మండల సర్వేయర్ రెడ్డి తవుటునాయుడు, వీఆర్వోలు భాస్కరరావు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



గిడుతూరులో శంకుస్థాపన చేస్తున్న అయ్యన్నపాత్రుడు

మాకవరపాలెం: రోడ్డు నిర్మాణ పనులకు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శంకుస్థాపన చేశారు. మండలంలోని గిడుతూరు నుంచి కోటవురట్ల మండలం సుంకపూర్ వెళ్లేందుకు రూ.1.80 కోట్లు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఈ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు ఆర్.వై.పాత్రుడు, గిడుతూరు మాజీ సర్పంచ్ శీరంరెడ్డి చినబాబు, పీఆర్ డీఈ ఈశ్వరరావు పాల్గొన్నారు.

వరుస తుపానులతో వరికి నష్టం

మాడుగుల: మండలంలో గత వారం రోజులు నుంచి కురుస్తున్న వర్షాలకు కోసిన వరి చేలు తడిచిపోవడంతో అన్నదాతలు బోరుమంటున్నారు. మండలంలో 30 గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాల్లో వరి చేలు తడిచిపోయినా సరే ప్రభుత్వం నుంచి ఎటువంటి భరోసా రాలేదని, అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పొలాల్లో తడుస్తున్న వరి చేలు ఏం చేయాలో తెలియని అయోమయంలో రైతులున్నారు.

మైదాన ప్రాంత గిరిజనులకు ఐటీడీఏ సదుపాయాలు కల్పించాలి

ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం: మైదాన ప్రాంతంలో నివాసం ఉంటున్న గిరిజనులకు ఏజెన్సీ ప్రాంతఉన్న గిరిజనులకు అందించే విధంగా కే.జిహెచ్‌లో వైద్యం సేవలు అందేలా చర్యలు చేపట్టాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి స్పీకరు అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకువచ్చారు. సుందరకోట గ్రామానికి విచ్చేసిన స్పీకర్‌కు స్థానిక ఎంపీటీసీ సభ్యుడిగా ఎంపీపీ స్థానంలో గిరిజనులు ప్రధాన సమస్యలు సభలో అయన దృష్టికి తీసుకెళ్లారు. గత వైఎస్సార్‌సీపీ హయంలో తాము సరుగుడు సుందరకోట పంచాయతీలో 530 మంది గిరిజనులకు పోడు వ్యవసాయం చేసే వారికి పట్టాలు అందజేశామన్నారు. ఇంకా 250 మంది వరకు గిరిజనులు ఉండిపోయారని వారందరికీ పట్టాలు పాసుపుస్తకాలు అందించాలన్నారు. సరుగుడు జలపాతాన్ని అభివృద్ధి చేయాలని, రెండు పంచాయతీల పరిధిలో మూడు సెల్‌టవర్లు ఏర్పాటు చేయాలని కోరారు. గిరిజన గ్రామాల్లో తాగునీటి పనులు పూర్తి చేయాలన్నారు. ఆర్డీవో రమణ మండల ప్రత్యేకాధికారి నాగ శిరీష, మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటరమణ, తాండవ ప్రాజక్టు చైర్మన్ సత్యనారాయణ, సర్పంచ్ కొండపల్లి చింతల్లి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ సూర్యచంద్ర పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

ప్రమాదకర చెట్టు తొలగింపు



చెట్టును తొలగిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

నాతవరం: విద్యుత్ వైర్లకు ప్రమాదకరంగా ఉన్న చెట్టును మంగళవారం నాత వరం విద్యుత్ శాఖ జేఈ ఎస్. చంద్రమౌళి దగ్గరుండి తొలగించారు. ఈ నెల 21వ తేదీన 'ప్రభుత్వ భూమిపై భూస్వామి కన్ను' అనే శీర్షికతో సాక్షిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు విద్యుత్ వైర్లుకు ఎలాంటి ప్రమాదం లేకుండా చెట్టును తొలగించారు. అక్కడ ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

సాక్షి ఎఫెక్ట్..

రైవాడలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ

దేవరాపల్లి: మండలంలోని రైవాడ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం మంగళవారం భూమిపూజ చేశారు. వై. జంక్షన్ నుంచి రైవాడ గ్రామంలోకి వెళ్లే రోడ్డు నిర్మాణానికి మండల పరిషత్ నుంచి రూ. 4 లక్షలు, పంచాయతీ నుంచి రూ.4 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో చేపట్టే సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ చల్లా లక్ష్మి, వైస్ ఎంపీపీ ఉగ్రూకుల గంగాభవానీతో కలిసి ప్రారంభించారు.

గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందుతు పడుతున్నారని, ఈ రోడ్డు నిర్మాణంతో కష్టాలు తీరుతాయని సర్పంచ్ లక్ష్మి, వైస్ ఎంపీపీ గంగాభవానీ ఆనందం వ్యక్తం చేశారు. నిధులు మంజూరుకు కృషి చేసిన ఎంపీపీ, జెడ్పీటీసీలకు గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంపీడీవో కార్యాలయ ఏవో డి.వి.లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ ఎం. కామేశ్వరరావు, పంచాయతీ సెక్రటరీ జామి అప్పారావు, ఎ. కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, కె.ఎస్. అప్పానాయుడు, చల్లా నాయుడు, ఉగ్రూకుల అప్పారావు, చల్లా బుజ్జి పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం

అంబరాన్నంటిన క్రిస్మస్ సంబరాలు

- విద్యుత్ కాంతులతో చర్చిల కనువిందు
- శుభాకాంక్షలు తెలిపిన ఐక్య పాస్టర్ల సంఘం



మాకవరపాలెం: పి.పి.అగ్రహారంలో విద్యుత్ దీపాలంకరణతో చర్చి



నర్సీపట్నం: విద్యుదీకరణతో అలంకరించిన సెంటనరీ బాప్టిస్టు చర్చి



నర్సీపట్నం: అందంగా అలంకరించిన ఆంధ్రా బాప్టిస్టు చర్చి



నర్సీపట్నం: క్రిస్మస్ ట్రీలతో సభా వేదికను అలంకరించిన ఆంధ్రా బాపిస్టు చర్చి వేదిక



శాంతాక్లాజ్ వేషధారణలో చిన్నారులు

చోడవరం: క్రిస్మస్ సంబరాలు అంబరాన్ని తాకాయి. మంగళవారం రాత్రి నుంచే గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. విద్యుత్ కాంతులతో చర్చిలన్నీ నక్షత్రాల వెలుతురులో ప్రకాశిస్తుండగా, కొనుగోలు అమ్మకాలతో బట్టల దుకాణాలు, స్వీట్‌స్టాళ్లు, బేకరీలు జనంతో సందడిగా మారాయి. బుధవారం క్రిస్మస్ పండగ కావడంతో ముందు రోజు నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభించారు. చోడవరం ఆర్సీఎం, బాప్టిస్టు, ద్వారకానగర్ ఇమ్మానియల్ చర్చి, జాన్ మాస్టారు చర్చితోపాటు గోవాడ, తదితర గ్రామాల చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చోడవరం పట్టణంలోని పాస్టర్లు ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. కొవ్వొత్తులు వెలిగించి, కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మేరీమాతగా, క్రిస్మస్ తాతగా వేషధారణ చేసి అందర్నీ అలరించింది. చర్చిల వద్ద ఏసుక్రీస్తు జననం సంబంధించిన సెట్‌లు వేసి అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే క్రిస్మస్ శుభాకాంక్షలు

క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులకు చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు, మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, వైఎస్సార్ సీపీ నాయకులంతా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

నర్సీపట్నం: సీబీఎం కాంపౌండ్‌లో నిర్మించిన సెంటినరీ బాప్టిస్టు, ఆంధ్ర బాప్టిస్టు చర్చిలను విద్యుదీకరణతో అందంగా అలంకరించారు. సెంటినరీ ఆంధ్ర బాప్టిస్టు చర్చిని బ్రిటిష్ వారు 1890లో, ఆంధ్ర బాప్టిస్టు చర్చిని 1964లో నిర్మించారు. వీటిని కెనడియన్ బాప్టిస్టు మిషన్ పేరుతో నడిపేవారు. అప్పటి నుంచి ఈ ప్రాంతాన్ని నేటికీ సీబీఎం కాంపౌండ్‌గా పిలుస్తుంటారు. వీటితోపాటు పట్టణంలోని అన్ని చర్చిలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి.

క్రిస్మస్ వేడుకలు

రవీంద్రభారతి స్కూల్‌లో క్రిస్మస్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జీసస్ జన్మించి నేటికి రెండు వేల ఏళ్లు దాటినా కరుణామయుడుగా దైవజనులు ఆరాధిస్తున్నారని పాఠశాల చైర్మన్ ఎంఎస్.మణి విద్యార్థులకు వివరించారు. శాంతా క్లాజ్, మేరీ, జోసెఫ్ వేషధారణలో విద్యార్థులు అలరించారు. ప్రిన్సిపాల్ గిరిధర్, డీఐ చప్పా గోవింద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో క్రిస్మస్ సందడి

మాకవరపాలెం: గ్రామాల్లో క్రిస్మస్ సందడి మొదలైంది. ఈ నేపథ్యంలో క్రైస్తవులు క్రిస్మస్ సందర్భంగా ఇళ్లపై రంగురంగుల స్టార్‌లను ఏర్పాటు చేసుకున్నారు. గ్రామాల్లో చర్చిలు విద్యుత్ దీపాలంకరణతో కాంతులీనుతున్నాయి.

మాడుగుల: చర్చిలకు ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ చేశారు. మాడుగుల ఆసెం చర్చిలో యేసు జన్మ వృత్తాంతాన్ని గడ్డితో చిత్రీకరించారు. యేసు చిత్రపటాలకు ప్రత్యేక అలంకరణ చేసారు. పలు గ్రామాల్లో చర్చిలను వేడుకలకు సిద్ధం చేశారు.

కె.కోటపాడు: చౌడువాడ సాయి విద్యావిహార్ పాఠశాలలో క్రిస్మస్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. క్రీస్తు కీర్తనలకు విద్యార్థుల నృత్యాల ప్రదర్శన ఆకట్టుకుంది. శాంతాక్లాజ్ వేషధారణలో అలరించారు. క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ప్రిన్సిపాల్ దీవి అప్పలకొండ(దత్తు) తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కె.కోటపాడులో యు.ఇ చర్చి, వారాడలో స్తుతి ప్రార్థన మందిరం, వి.సంతపాలెంలో సార్వత్రిక క్రీస్తు సంఘం, ఆనందపురం, చౌడువాడ గ్రామాల్లో ఆంధ్రా బాపిస్టు చర్చిలను ముస్తాబు చేసి క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు.

ముఠా కార్మికులకు కూలీ రేట్లు పెంచాలి

అనకాపల్లి: ముఠా కార్మికుల కూలీ రేట్లు పెంచాలని ముఠా కార్మికుల సంఘం(సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 26న తలపెట్టిన కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని పట్టణంలో ముఠా కార్మికుల సంఘాల నాయకులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 మాసాల క్రితం ముఠా కార్మికులకు కూలీ రేట్ల పెంపుపై ఒప్పందం జరిగిందని గుర్తు చేశారు. తక్షణం కూలీ రేట్లు పెంచాలని వర్తక సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు, షాపు యజమానులకు తెలియజేసినప్పటికీ సరైన సమాధానం లేకుండా పోయిందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు జీతాలు పెంచాలని కోరారు.